నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
7PM

టీడీపీ నేతల ఇళ్ళలో పోలీసుల సోదాలు

నెల్లూరు జిల్లాలో పోలీసుల సోదాలు రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయి. మాజీ మంత్రి నారాయణ అనుచరుల ఇళ్లతో పాటు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నివాసంపై పోలీసులు దాడులు చేస్తున్నారని సమాచారం. ఈరోజు ఉదయం నుంచి భారీగా పోలీసులు వారి ఇళ్లను చుట్టుముట్టారు. మాజీ జెడ్పీటీసీ ముప్పాళ్ల విజేతరెడ్డి ఇంట్లో కూడా సోదాలు జరిపారు. దీంతో టీడీపీ నేతలే లక్ష్యంగా దాడులు చేస్తారా అని పోలీసుల తీరుపై కోటంరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బంగారం ధర 10 GRMS 24 CARAT ₹64,090

వెండి ధర 1KG 77,000

సెన్సెక్స్ 73,900

నిఫ్టి 22,407

చికెన్ ధర 1KG ₹ 260

గుడ్ల ధరలు డజన్ ₹68



సన్‌రైజర్స్‌కు కొత్త కెప్టెన్
ప్యాట్ కమిన్స్
ప్రకటించిన ఫ్రాంఛైజీ

ఐపీఎల్-2024 ఆరంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ కొత్త కెప్టెన్ పేరును ప్రకటించింది. ముందుగా ఊహించినట్లుగానే ఆస్ట్రేలియా సారథి ప్యాట్ కమిన్స్‌కు ఎస్ఆర్‌హెచ్ నాయకుడిగా బాధ్యతలు అప్పగించింది. గత సీజన్‌లో సారథిగా వ్యవహరించిన సౌతాఫ్రికా స్టార్ ఐడెన్ మార్క్రమ్ స్థానాన్ని కమిన్స్‌తో భర్తీ చేసింది. కాగా 2016లో డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని గెలిచింది సన్‌రైజర్స్. ఆ తర్వాత మళ్లీ చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించలేకపోయింది. ఈ క్రమంలో వార్నర్‌పై వేటు వేయగా.. ఆ తర్వాత పరిస్థితి మరింత దిగజారింది.

కేన్ మామనూ మార్చేసింది

వార్నర్ స్థానంలో న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్‌ను కెప్టెన్‌గా తీసుకువచ్చినప్పటికీ అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయింది. ఫలితంగా కేన్ మామకూ బైబై చెప్పింది ఫ్రాంఛైజీ.

మార్క్రమ్‌కూ ఉద్వాసన

ఐపీఎల్-2022 ఎడిషన్‌లో పద్నాలుగింట కేవలం ఆరు మ్యాచ్‌లు మాత్రమే గెలిచి పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానానికి పరిమితం కావడంతో ఈ మేరకు కేన్ మామపై వేటు వేసింది. అతడి స్థానంలో ఐడెన్ మార్క్రమ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయినప్పటికీ ఎస్ఆర్‌హెచ్ రాత మారలేదు సరికదా మరింత పేలవ ప్రదర్శనలతో విమర్శలు మూటగట్టుకుంది. గతేడాది పద్నాలుంగిట కేవలం నాలుగు మాత్రమే గెలిచి అట్టడుగున పదో స్థానంలో నిలిచింది.

రూ. 20 కోట్లు ఖర్చు చేసి మరీ

ఈ నేపథ్యంలో సరైన సారథి వేటలో పడిన సన్‌రైజర్స్ ఐపీఎల్-2024 వేలంలో భాగంగా ప్యాట్ కమిన్స్ కోసం ఏకంగా రూ. 20.50 కోట్లు ఖర్చు చేసింది. వన్డే వరల్డ్‌కప్-2023లో ఆసీస్‌ను చాంపియన్‌గా నిలిపిన ఈ పేస్ బౌలర్ కోసం భారీ మొత్తాన్ని వెచ్చించి.. తాజాగా అతడిని కెప్టెన్‌గా ప్రకటించింది. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మార్చి 23న జరుగనున్న మ్యాచ్‌తో సన్‌రైజర్స్ తాజా ఎడిషన్ ప్రయాణాన్ని ఆరంభించనుంది. ఆ తర్వాత మార్చి 27న హైదరాబాద్‌లో ముంబై ఇండియన్స్‌తో, మార్చి 31న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో, ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. తొలి దఫా షెడ్యూల్‌లో భాగంగా ఈ మేరకు మ్యాచ్‌లు ఆడనుంది.

ఇండియన్ ఐడల్-14
విజేతగా వైభవ్ గుప్తా

ఇండియన్ ఐడల్-14 విజేతగా వైభవ్ గుప్తా నిలిచాడు. ఆదివారం రాత్రి జరిగిన గ్రాండ్ ఫినాలేలో వైభవ్ టైటిల్ సాధించాడు. ఆయనకు ట్రోఫీతో పాటు రూ.25 లక్షల ప్రైజ్‌మనీ,బ్రెజ్జా కారును బహుమతిగా నిర్వాహకులు అందించారు. టాప్-6లో వైభవ్‌తో పాటు ఆద్య మిశ్రా, అనన్య పాల్, పీయూష్ పన్వార్, శుభదీప్ దాస్, అంజనా పద్మనాభన్ ఉన్నారు. మిగిలిన వారిని వెనక్కి నెట్టి ఫైనల్‌లో విజేతగా వైభవ్ నిలిచాడు.

140 కోట్ల మంది ప్రజలే
నా కుటుంబం
ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఆదిలాబాద్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. మోదీకి కుటుంబం లేదని ప్రతిక్షాలు విమర్శిస్తున్నాయని, మోదీ జైలుకు వెళ్లలేదని, రాజకీయాలు రావని అంటున్నారని, కానీ తెలంగాణ ప్రజలారా నా జీవితం తెరిచిన పుస్తకం అని మోదీ అన్నారు. ఓ లక్ష్యంతో చిన్నతనంలోనే ఇంటిని వదిలి వెళ్లానని, దేశ ప్రజల కోసం జీవించాలన్న స్వప్నంతో ఇళ్లు విడిచి వెళ్లినట్లు ప్రధాని తెలిపారు. తన జీవితంలో ప్రతి క్షణం కేవలం ప్రజలకే కేటాయించినట్లు చెప్పారు. మీ స్వప్నాలే నా సంకల్పం అవుతుందని ఆయన ప్రజలను ఉద్దేశించి అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా మార్చనున్నట్లు చెప్పారు. అందుకే దేశ ప్రజలు తనను స్వంత మనిషిలా చూస్తారని, కుటుంబ వ్యక్తిలా ప్రేమను పంచుతారని, అందుకే 140 కోట్ల మంది దేశ ప్రజలే నా కుటుంబం అని ప్రధాని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి పేద తన కుటుంబమే అన్నారు. పిల్లలు, పెద్దలు, అనాథలు అందరూ తనవారే అన్నారు. మేరా భారత్, మేరా పరివార్ అని ప్రధాని మోదీ అన్నారు. దేశమే కుటుంబం అన్న సంకల్పంతో ప్రజల కోసం జీవిస్తున్నానని మోదీ తెలిపారు. దేశం ఇప్పుడు ఒకే స్వరంతో .. మై హూ పరివార్ అని అంటోందన్నారు. నేనే మోదీ కుటుంబం అని అంటోందని ఆయన పేర్కొన్నారు. మై హూ మోదీ పరివార్ అని సభకు వచ్చిన

ప్రజలతో మోదీ పలికించారు. తెలంగాణ ప్రజలకు ఓ సందేశం ఇవ్వాలనుకుంటున్నానని, గర్వంతో నిండిన ప్రజలకు చెబుతున్నానని, రామ మందిరంలో బంగారు దర్వాజాలు, ఆ మందిరంలోని స్తంభాల్లో తెలంగాణ పాత్ర ఉందన్నారు. యావత్ తెలంగాణ ప్రజల పట్ల దేశం ధన్యవాదాలు వ్యక్తం చేస్తోందన్నారు. రామ్‌లల్లా ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉందన్నారు. సమృద్ధి దేశాల సరసన ఇండియాను నిలపనున్నట్లు చెప్పారు. మన తల్లితండ్రులు కష్టాల్లో బ్రతికారని, కానీ మన పిల్లలు అలాంటి పరిస్థితిలో ఉండకుండా చూద్దామన్నారు. తెలంగాణ ప్రజలారా మీ ఆశీర్వాదం కావాలని, అపారమైన ప్రేమ కావాలన్నారు. ఇండియా కూటమి నేతలు అవినీతి, ఆశ్రితపక్షపాతంలో కూరుకుపోయారని, వాళ్లు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఆ కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేసిందని, వాళ్ల కుటుంబ పాలన గురించి ప్రశ్నించడం మొదలు పెట్టిన తర్వాత.. వాళ్లు మోదీకి ఫ్యామిలీ లేదని అంటోందని ఇండియా కూటమిని ఆయన తప్పుపట్టారు.

సుప్రీం తీర్పును ప్రశంసించిన ప్రధాని మోదీ

లంచం కేసుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఎలాంటి మినహాయింపులూ ఇవ్వకూడదంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. ఇదో గొప్ప తీర్పు అంటూ ప్రశంసించారు. సుప్రీం తీర్పు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. 'సుప్రీంకోర్టు గొప్ప తీర్పు ఇచ్చింది.

స్టేట్, సెంట్రల్ గవర్నమెంట్ల మధ్య

సామరస్యపూర్వక వాతావరణం ఉండాలి
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘర్షణ పడితే ప్రజలకు నష్టమని.. స్టేట్, సెంట్రల్ గవర్నమెంట్ల మధ్య సామరస్యపూర్వక వాతావరణం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని.. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి ముందుకు పోతామని స్పష్టం చేశారు. హైదరాబాద్లోని మూసీ నది అభివృద్ధికి కేంద్రం సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం మోడీ పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చాక తెలంగాణ సమస్యలను ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. పలు అంశాలపై కేంద్ర సానుకూలంగా నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తాం: ప్రధాని మోడీ స్కైవేల నిర్మాణానికి డిఫెన్స్ భూములను ఇచ్చారని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్లా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పెద్దన్నలా ప్రధాని మోడీ సహకరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశం 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలంటే తెలంగాణ కూడా డెవలప్ కావాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం కారణంగా పదేళ్లలో రామగుండం ఎన్టీపీసీలో 1600 మెగావాట్ల విద్యుదుత్పత్తి మాత్రమే జరిగిందని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు భారీ ఓటమి
ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు

వచ్చే ఎన్నికల్లో జగన్ భారీ ఓటమి ఖాయమని పొలిటికల్ ఎనలిస్ట్ ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన... సమకాలీన రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్ కు ఓటమి కాదు భారీ ఓటమి ఖాయమన్నారు. చదువుకున్న వాళ్లు ఉద్యోగాలు కోరుకుంటున్నారు, ఉచిత పథకాలు కాదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో డబ్బులిస్తున్నామంటే ఓట్లు రాలవన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ముఖ్యమన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఓటమి కూడా ఇదే కారణన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. ప్రశాంత్ కిషోర్ 2019 ఎన్నికల్లో వైసీపీ వ్యూహకర్తగా పని చేశారు. వైసీపీ విజయం పీకే కీలక పాత్ర పోషించారు. అయితే తాజాగా ఆయన వైసీపీ పాలనపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం కలకలం రేపుతున్నాయి. పీకే కామెంట్స్ పై వైసీపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో కౌంటర్ ఇస్తున్నాయి. సర్వేలన్నీ వైసీపీకి అనుకూలంగా ఉన్నాయని... జగన్ ప్రభుత్వమే వస్తుందని చెబుతున్నాయి.

అదే జగన్ కు పెద్ద మైనస్

హైదరాబాద్‌లో ఓ పత్రికా కాంక్లేవ్‌లో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్... ఏపీ రాజకీయాలపై స్పందించారు. ప్రజల బాగోగులు చూస్తున్నామంటూ వాళ్ల సొమ్మును ఖర్చు చేయడం తప్పు అన్నారు. ఏపీ సీఎం జగన్ ఇలా చేస్తుండడం వల్లే రాజకీయంగా నష్టపోతున్నారన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఈ కారణంగానే ఓడిపోయారన్నారు. గత ఏడేళ్లలో ఏం చేశారనేది చూసి ప్రజలు ఓట్లు వేస్తున్నారన్నారు. ఎన్నికలపై విద్య, ఉపాధి, అభివృద్ధి ప్రభావిత అంశాలు అన్నారు. ప్యాలెస్‌లో కూర్చొని బటన్స్ నొక్కితే ఓట్లు పడవన్నారు. ప్రజల మధ్యలోకి రాకపోవడం సీఎం జగన్‌కు మైనస్ అవుతుందని పీకే జోస్యం చెప్పారు. గతంలోనూ వైసీపీ పాలనపై ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు చేశారు. సంపద సృష్టించకపోతే డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి పంచుతారన్నారు. సంపద సృష్టించే బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. సంపద సృష్టికి ప్రభుత్వాలే సహకరించకపోతే పంచటానికి సొమ్ము ఎక్కడి నుంచి వస్తుందన్నారు.

గుంటూరు కారం పూజా వెర్షన్ పిక్స్ వైరల్.!

నుంచే పలు ఇబ్బందులు మార్పులు చేర్పులు తర్వాత ఎట్టకేలకు గుంటూరు కారం గా రిలీజ్ అయ్యింది. మరి ఈ సినిమాకి చేసిన భారీ మార్పులో పూజా హెగ్డే ని మార్చడం కూడా ఒకటి. అయితే ఇప్పుడు లేటెస్ట్ గా పూజా హెగ్డే పై కొన్ని స్టిల్స్ బయటకు వచ్చి ఆకస్మికంగా వైరల్ అవుతున్నాయి. తాను శ్రీలీల ఉన్న వెర్షన్ సినిమా స్టిల్స్ దీనితో ఈ పిక్స్ చూసిన ఫ్యాన్స్ అయితే ఇది చూసి కాస్త బాధపడుతున్నారు. ప్రస్తుతానికి అయితే ఈ పిక్స్ మంచి వైరల్ గా మారిపోయాయి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా హారికా హాసిని వారు నిర్మాణం వహించారు.

'డబుల్ ఇస్మార్ట్'లో దిశాపటాని?

ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని – డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కలయికలో 'డబుల్ ఇస్మార్ట్' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఈ డబుల్ ఇస్మార్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉందట. ఇప్పుడు ఈ సాంగ్ ను అనన్య పాండేతో చేయిస్తున్నారని టాక్. పూరి దర్శకత్వంలో వచ్చిన లైగర్ సినిమాలో అనన్య పాండే హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. కాగా ఈ మూవీలో సంజయ్ దత్ కీలక పాత్ర చేస్తుండగా పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానుంది. పూరి జగన్నాథ్ మరియు ఛార్మి కౌర్ కలిసి పూరీ కనెక్ట్స్‌పై, విషు రెడ్డి సీఈవోగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టింది. మరి, డబుల్ ఇస్మార్ట్ ఏ రేంజ్ లో సక్సెస్ అవుతుందో చూడాలి.



7న పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 7న ఫలక్‌నుమా వద్ద మెట్రో నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 5.5 కి.మీ. మార్గంలో చేపట్టనున్న ఈ మార్గానికి సుమారు రూ.2 వేల కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు అంచనా. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పాతబస్తీ మెట్రో నిర్మాణానికి 2012లోనే ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల ఎంజీబీఎస్ వరకే నిలిపి వేశారు. పాతబస్తీలో రోడ్డు విస్తరణ, నిర్మాణాల కూల్చివేతలకు ఆటంకం వంటి కారణాల వల్ల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలోనే అడ్డంకులన్నీ తొలగిపోయి డీపీఆర్ సహా అన్ని పనులు పూర్తయినప్పటికీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కూడా నిర్లక్ష్యం చేసింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీ మెట్రోపై దృష్టి సారించి, బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించింది.

డ్రోన్ సర్వే...

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మార్గంలోని ఆధ్యాత్మిక స్థలాల పరిరక్షణ కోసం గత ఆగస్టులో డ్రోన్ సర్వే నిర్వహించారు. దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు 103 మతపరమైన, ఇతర సున్నితమైన కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. కర్వేచర్ సర్దుబాటు, వయాడక్ట్ డిజైన్, ఎత్తులు, మెట్రో పిల్లర్ లొకేషన్‌లలో తగిన మార్పు లు తదితర ఇంజనీరింగ్ పరిష్కారాల కోసం డ్రోన్ ద్వారా సేకరించిన డేటా దోహదపడుతుందని అధికారులు తెలిపారు. మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు విస్తరణను కూడా 80 అడుగులకే పరిమితం చేశారు. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో మొదటి ఫేజ్ ప్రాజెక్ట్ నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు అందుబాటులోకి వస్తే నాలుగు వందల ఏళ్ల నాటి చారిత్రాత్మక చార్మినార్ కట్టడాన్ని మెట్రో రైల్‌లో వెళ్లి సందర్శించవచ్చు. అలాగే, సాలార్‌జంగ్ మ్యూజియం, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి చారిత్రక కట్టడాలనూ వీక్షించే అవకాశం ఉంటుంది.

ఐదు స్టేషన్లు: ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడి నుంచి దారు షిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీ జాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌ను మా వరకు ఈ 5.5 కి.మీ. అలైన్‌మెంట్ ఉంటుంది. ఈ మార్గంలో 5 స్టేషన్లు రానున్నాయి. ఎంజీబీఎస్ తరువాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్‌లు ఉంటాయి.

'LRS' అంశంపై కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అడ్డమైన హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఎందుకు మాట నిలబెట్టుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం భట్టి మాటలు వట్టి మాటలు అయ్యాయని ఎద్దేవా చేశారు. కాగా, కేటీఆర్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికల్లో గెలవడానికి అడ్డగోలు హామీలు ఇచ్చింది కాంగ్రెస్. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక నిర్ణయం తీసుకుంటే దానిపై విషం చిమ్మింది. ఇప్పుడు అదే పథకాలను కాపీ కొడుతూ కాంగ్రెస్ పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. ఎల్ఆర్ఎస్ ద్వారా లేఅవుట్‌లు క్రమబద్ధీకరణ చేయాలని చూస్తోంది. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎల్ఆర్ఎస్ వద్దని కోర్టుకు వెళ్లారు. డిప్యూటీ సీఎం భట్టి గతంలో ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ హోదాలో NO TRS NO LRS అని ప్రకటించారు. ఎల్ఆర్ఎస్ ఎవరు కట్టోద్దు అంటూ ప్రకటన చేశారు. అప్పుడు ఎందుకు విమర్శించారు.. ఇప్పడెందుకు అదే పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనిపై రభుత్వం సమాధానం చెప్పాలి. అప్పుడు ప్రజల రక్త మాంసాలు పీలుస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు కూడా ప్రజల రక్త మాంసాలు పీల్చడానికి ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా గతంలో మీరన్న మాటలే కదా?. భట్టి మాటలు వట్టి మాటలు అయ్యాయి. మధ్య తరగతి పేదల మీద 20వేల కోట్లు మోపేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు వసూలు చేసి భారం మోపుతోంది కాంగ్రెస్. ఈనెల 6న ఎల్ఆర్ఎస్ రద్దు కోసం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తాం. అదే రోజు అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నిరసనలు చేస్తాం. ఏడో తేదీన కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతున్నాం' అని స్పష్టం చేశారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ మళ్లీ డుమ్మా..

వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించాలని రిక్వెస్ట్

లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరయ్యే విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వరుసగా ఎనిమిదోసారి హ్యాండిచ్చారు. ఈ కేసులో తమ ఎదుట విచారణకు హాజరవ్వాల్సిందిగా ఇటీవలే ఎనిమిదవసారి ఈడీ కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. ఈ విచారణకు సోమవారం ఈడీ ఎదుటకు రావాల్సి ఉండగా కేజ్రీవాల్ రాలేదు. సోమవారం(మార్చి 4) తాను ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉన్నందునే విచారణకు హాజరవడం లేదని కేజ్రీవాల్ తెలిపారు. అయితే ఈసారి మాత్రం ఈడీకి ఆయన ఒక ట్విస్ట్ ఇచ్చారు. మార్చ్ 12వ తేదీన ప్రత్యక్షంగా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని సమాచారమిచ్చారు. కాగా, లిక్కర్ పాలసీ కేసులో గత ఏడాది నవంబర్ 2, డిసెంబర్ 22, జనవరి 3, 2024, జనవరి 18, ఫిబ్రవరి 2, ఫిబ్రవరి 14, ఫిబ్రవరి 26, మార్చ్ 4వ తేదీల్లో ఇప్పటికి ఎనిమిదిసార్లు ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరయ్యారు.

నన్ను క్షమించలేనని మోడీ అప్పుడే చెప్పారు..

టికెట్ దక్కకపోవడంపై ప్రజ్ఞా ఠాకుర్

బీజేపీ శనివారం విడుదల చేసిన లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో భోపాల్ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకుర్‌కు చోటు దక్కలేదు. దీనిపై ఆమె ఆదివారం స్పందించారు. తనను క్షమించలేనని ప్రధాని మోడీ గతంలోనే చెప్పారని వ్యాఖ్యానించారు. తాను చేసిన కొన్ని వ్యాఖ్యలు ఆయన్ను అసంతృప్తికి గురిచేశాయని తెలిపారు. "నేను గతంలోనూ టికెట్ ఇవ్వమని కోరలేదు. ఇప్పుడు కూడా అడగడం లేదు. గతంలో నేను చేసిన కొన్ని వ్యాఖ్యల్లో ఉపయోగించిన పదజాలం మోదీకి నచ్చలేదు. ఈ విషయాన్ని ఆయన అప్పడే చెప్పారు. నన్ను ఎప్పటికీ క్షమించలేనని కూడా అన్నారు. అయినా, నేను మాత్రం ఆయనను క్షమాపణలు కోరాను" అని ప్రజ్ఞా సింగ్ ఠాకుర్ తెలిపారు. పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తనకు టికెట్ ఇవ్వలేదనే అంశంపై దృష్టి పెట్టొద్దని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాలేగావ్ పేలుళ్ల కేసులో జైలులో ఉన్న ప్రజ్ఞా ఠాకుర్ ఆరోగ్య సమస్యల కారణంతో బయటకు వచ్చి గత ఎన్నికల్లో భోపాల్ నుంచి పోటీ చేసి గెలిచారు. గాడ్సేను దేశ భక్తుడని గతంలో ఆమె అభివర్ణించడం వివాదాస్పదమైంది. ఆ విషయంపై మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదని, ప్రజ్ఞా క్షమాపణలు అడిగినా పూర్తిగా క్షమించలేకపోతున్నానని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈసారి ఆమె టికెట్ దక్కించుకోలేకపోయారు. భోపాల్ నుంచి మాజీ మేయర్ ఆలోక్ శర్మను పార్టీ బరిలోకి దించుతోంది. ప్రజ్ఞా ఠాకుర్‌తో పాటు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి విమర్శల పాలైన సిటింగ్ ఎంపీలైన పర్వేశ్ వర్మ, రమేశ్ బిధూరి, జయంత్ సిన్హాలకు సైతం తాజా జాబితాలో చోటు దక్కలేదు. సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' కూటమిని ఎదుర్కోనున్న వేళ ప్రత్యర్థికి ఏ ఒక్క అవకాశమూ ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే భాజపా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మార్చిలో 14 రోజులు బ్యాంకులకు సెలవులు

దేశవ్యాప్తంగా బ్యాంక్ వినియోగదారులకు ఇది అలెర్ట్ న్యూస్ అనే చెప్పాలి.. ఒకటి కాదు రెండు కాదు మార్చి నెలలో ఏకంగా 14 రోజులు బ్యాంకులకు సెలవులు రానున్నాయి. దేశంలోని అన్ని బ్యాంకులు గెజిటెడ్ సెలవులను అనుసరిస్తాయి. ప్రభుత్వ సెలవు దినాలలో అన్ని బ్యాంకులు మూసివేయబడినప్పటికీ, కొన్ని బ్యాంకులు ప్రాంతీయ పండుగలు మరియు సెలవులను పాటిస్తాయి. 2024 మార్చి నెలలో మహాశివరాత్రి, హోలీ వంటి అనేక పండుగలు ఉన్నాయి. ఇలా వాటన్నిటికి సెలవులు ప్రకటించగా బ్యాంక్ వర్కింగ్ డేస్ 17 రోజులు మాత్రమే ఉంది. ఏ ఏ రోజు బ్యాంకులకు సెలవులు అనేది పరిశీలిస్తే

జాతీయ సెలవుదినాలు:

మార్చి 1: చాప్చార్ కుట్ (మిజోరం)

మార్చి 8: మహాశివరాత్రి (త్రిపుర, మిజోరం, తమిళనాడు, సిక్కిం, అస్సాం, మణిపూర్, ఇటానగర్, రాజస్థాన్, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్, న్యూఢిల్లీ, గోవా, బీహార్, మేఘాలయ మినహా)

మార్చి 25: హోలీ (కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, మణిపూర్, కేరళ, నాగాలాండ్, బీహార్, శ్రీనగర్ మినహా)

మార్చి 29: గుడ్ ఫ్రైడే (త్రిపుర, అస్సాం, రాజస్థాన్, జమ్మూ & కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ మినహా)

మార్చి 22: బీహార్ దివస్ (బీహార్)

మార్చి 26: యయోసాంగ్ రెండవ రోజు/హోలీ

మార్చి 27: హోలీ (బీహార్)

రెగ్యులర్ బ్యాంక్ సెలవులు:

ప్రతి రెండవ శనివారం (మార్చి 9)

ప్రతి నాల్గవ శనివారం (మార్చి 23)

ఆదివారాలు: మార్చి 3, 10, 17, 24, 31

ఈ మూసివేతలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి.

ముగ్గురు పిల్లలను చంపి చెట్టుకు ఉరేసుకున్న తండ్రి

ముగ్గురు పిల్లలను చంపేసిన తండ్రి.. తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని టంగుటూరుకు చెందిన రవి (35) 'మనీస్కీమ్' పేరుతో చుట్టుపక్కల గ్రామాల్లోని వారితో డబ్బులు కట్టించాడు. ఈ స్కీమ్ ద్వారా రూ.వెయ్యికి రూ.3000, 58 రోజుల వ్యవధికి రూ.లక్షకు రూ.5 లక్షలు ఇప్పిస్తానంటూ డబ్బులు కట్టించాడు. తీరా డబ్బులు ఇవ్వకపోవడంతో కట్టిన వారంతా అతడిని అడగడం మొదలు పెట్టారు. డబ్బులు ఇవ్వాలంటూ ఒక్కొక్కరుగా ఇంటికి రావడంతో ఏం చేయాలో తోచని స్థితిలో ముగ్గురు పిల్లలను చంపేసి తానూ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.